# ఆ పాట పాడొద్దు తాతయ్యా!


డి.ఆర్.ఇంద్ర

"ఏమండోయ్ సత్యమూర్తిగారు! కొత్త ప్రభుత్వం కరువు భత్యం ప్రకటించింది! ఈ నెల నుండే కాష్ ఇస్తారట. కేంద్రం ప్రకటించిన కరువు భత్యం ముష్టి మాజోలెల్లోనూ ఎపుడు వేస్తారని ఉద్యోగస్తులు ఆందోళన చేసి పీడించే వరకూ తనంతట తాను ప్రకటించడం మన రాష్ట్ర ప్రభుత్వానికెపుడూ అలవాటు లేదుగా. కొత్త ప్రభుత్వం ఉద్యోగస్తులను దువ్వి, మంచి చేసుకోడానికి ఎత్తిన ఎత్తు కాదుటండీ ఇది? ఉద్యోగస్థులపై ప్రేమ కురిసిపోయి కాదు. మీకో వంద పెరుగుతుందనుకుంటాను?" ప్రక్కవాటా విశ్వనాధం పేపరు ముడుస్తూ చెప్పాడు మార్కెట్‌కి బయలుదేరుతూన్న సత్యమూర్తితో.

సత్యమూర్తి అవునన్నట్టు తలూపి ఆలోచిస్తూ రోడ్డెక్కాడు. కరువు భత్యం ముష్టి తనకో వంద పెరుగుతుందేమో. డబ్బు లెక్కలు వేసుకోవడం తానేనాడూ చేయలేదు. తనకి చాతకాదు. 'ఇది మీ జీతం మాష్టారు' అని స్కూలు గుమస్తా ఇస్తే అదలాగే జేబులో పెట్టుకుని తీసుకెళ్ళి రుక్మిణి చేతుల్లో పెట్టే వాడు. పొదుపుగా, గుట్టుగా సంసారాన్ని ఆడవాళ్ళు నెట్టుకొచ్చినట్టు మగవాడు నిర్వహించలేడని తన నమ్మకం. రుక్మిణి చేతల్లో తన నమ్మకం రైటని నిరూపించింది. తన జేబు ఖర్చు కోసమని రుక్మిణి వారానికో ఐదు రూపాయలు తన జేబులో పెడ్తే, వారం చివర తన జేబులో ఆ నోటు అలాగే ఉండేది. అది చూసి రుక్మిణి నవ్వేది - సముద్ర కెరటాల పాల నురగలు తనని ముంచెత్తినట్టు. రుక్మిణి నవ్వు చూడటం కోసమైనా తను ఆ నోటు ఖర్చు చేయకుండా అలాగే ఉంచేవాడు. రుక్మిణి నవ్వు తనకో వరం. మూతి బిగించి పెదవులు దాటని ఆ చిరునవ్వులో కోటి ఇంద్రధనస్సులు! నవ్వినపుడల్లా ఆ సప్తవర్ణాలనీ ఏం జేబుల్లో నింపుకునేవాడు - చిన్నపుడు పొగడపూలు ఏరుకున్నట్టు.

రుక్మిణి తనని వంటరిని చేసి పోతూ పోతూ సప్త వర్ణాలనీ కొంగున కట్టుకుని తనకి వర్ణ విహీన జీవితాన్ని మిగిల్చిపోయింది. ఆరిపోయిన క్రొవ్వొత్తి తన జీవితం. తన బ్రతుకుని వెలిగించే జీవ పదార్థం రుక్మిణి - హరాయించుకుపోయింది. తను స్వార్థపరుడు - రుక్మిణి లేని జీవితాన్ని ఊహించలేక, రుక్మిణికన్నా ముందే తను పోవాలని కోరుకున్నాడు. మనిషి స్వార్థాన్ని గ్రహించిన విధాత అతను కోరుకున్నది ఇవ్వక తనిచ్చిందే తీసుకొమ్మని నిర్బంధిస్తాడు కాబోలు! యాదృచ్ఛికమో, మరొకటో కానీ, రుక్మిణి సంవత్సరీకాల నాడే - 'అత్తగారు పుట్టారు' అని కోడలి దగ్గరి నుండి టెలిగ్రాం వచ్చింది. ఆ నెత్తుటి కందులో రుక్మిణి పోలికలు కొట్టొచ్చినట్లు కనిపించాయి! జంటని కోల్పోయిన వంటరిగా కాలక్షేపం అవడం బహుకష్టంగా ఉన్న తనకి మనమరాలితో కొత్త జీవితం దొరికినట్లయ్యింది. పాపకి తల్లి స్థన్యం మాత్రమే యిస్తే మిగతా పెంపకమంతా తనే చూసాడు.

అందుకే ఆ పిల్లకి తల్లిదండ్రులకన్నా తన తోటే అనుబంధమెక్కువ. తల్లిమీద, అత్తగారిమీద ఉండే గౌరవాభిమానాల కొద్దీ పిల్లకి రుక్మిణి అనే పేరు పెడతామన్నారు. "రుక్మిణి ఎపుడూ నా హృదయంలో ఉండే దీపమే - భారతి అని పేరు పెడదాం భారతమాతకి చిహ్నంగా" అన్నాడు తనే. దాంతో స్వాతంత్ర సమరయోధుడి మనుమరాలికి ఆ పేరే చక్కగా ఉంటుందనిపించింది వారికీ. అమ్మమ్మ నవ్వుని పుణికిపుచ్చుకున్న చిన్ని భారతి 'నీ సంగతి నాకు తెలుసులే' అన్నట్టు నవ్వి కవ్విస్తుంది. ఆ నవ్వు తనకి రుక్మిణి దూరమైన దిగులుని కొంతైనా తీర్చేది. అసలు తన జీవితంలో రుక్మిణి ప్రవేశించడమే తను నమ్మలేని గొప్ప నిజం. ముందూ వెనకా తన వారంటూ ఎవరూ లేని తానొక ఇంటి వాడవుతాడనికానీ, తన వంటరి జీవితంలో కోయిల కూజితాలు వినిపిస్తాయనిగానీ అనుకోలేదు. దయార్ద్ర హృదయంగల కొద్దిమంది ఇళ్లల్లో వారాలు చేసుకుని చదువుకునే తనకి పుస్తకాలు, ఫీజులకి ధన సహాయానికి ప్లీడరు దాసుగారి వద్దకు వెళ్ళి ఆశ్రయించమని ఎవరో సలహా ఇవ్వడం తన జీవితాన్నే మార్చేసింది. జమీందారీ భవనం లాంటి ఆ ఇంట్లోకి అడుగుపెట్టడానికే భయం వేసింది మొదట. కానీ దాసుగారి చల్లని చూపు తన భయాన్ని పోగొట్టి అభయ హస్తమిచ్చి తన జీవితానికో దారి చూపింది. ఆయన ఇంట భోజనమేకాక, తలదాచుకోడానికి నీడ, చదువుకో అండా దొరికాయి. తాతలిచ్చిన పెద్ద ఆస్థితో బాటు రెండు చేతులా సంపాదననిస్తున్న ప్లీడర్ గిరీని తృణీకారంగా చూసి చిన్న వయసులోనే స్వాతంత్రోద్యమంలోకి దూకాడు దాసు. స్వాతంత్ర్య పోరాట యోధులకి ఆ ఇల్లొక అన్నపూర్ణ. బ్రిటిస్ దమన నీతికి, అణచివేత, బల ప్రయోగాలకి విరుగుడుగా చేబట్టాల్సిన కార్యక్రమాల గురించి నిరంతరం ఆ ఇంట్లో సమావేశాలు, చర్చలూ వేడి వేడిగా సాగుతూండేవి. దానివల్లే తనకీ రాజకీయాల గురించీ, ప్రతీ ఒకరూ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలోకి దూకాల్సిన అవసరం గురించీ బాగా తెలిసి వచ్చింది. చదువుతూన్న స్కూల్ ఫైనల్‌కి సున్న చుట్టి ఉద్యమంలోకి దూకుదామనుకున్నాడు. దాసుగారే వారించి చదువుకొనసాగిస్తూనే ఉద్యమ కార్యకర్తకమ్మన్నాడు.



ఆ ఇంట తన కళ్ళు రెండు ఆడ ప్రాణుల కోసం ఎదురు చూసేవి. తల్లినెరగని తనకి ఆలోటు పూడ్చిన ప్లీడరుగారి భార్య ఒకరైతే, రెండవది కాళ్ళ వెండి పట్టాలు ఘల్లు ఘల్లుమని చప్పుడు చేస్తూంటే నెమిలి నడకతో వచ్చి ప్లీడరుగారి మెడ పట్టుకు వేళ్ళాడే ఎనిమిదేళ్ళ రుక్మిణి. ఆ దంపతులకి పుట్టడం రుక్మిణి చేసుకున్న అదృష్టం అనుకునేవాడు. చురుకైన స్వాతంత్రోద్యమ కార్యకర్తగా పేరుపడ్డ తను త్వరలోనే ప్రభుత్వం దృష్టిలోనూ, పోలీసుల దృష్టిలోనూ కూడా పడ్డారు. బ్రిటిష్ అణచివేత విధానాలకి వ్యతిరేకంగా సాగిన ఎన్నో నిరశన ప్రదర్శనలకు, ఊరేగింపులకీ ముందు నడిచి లాఠీ దెబ్బలు తిన్నాడు. జైలు జీవితం రుచి చూసాడు. అనాధగా అంతర్గతంగా తనలో ఉండే భయం, పిరికితనం పోయి మనిషీ రాటుదేలాడు. దాసుగారి క్కూడా లాఠీ దెబ్బలు, జైలు జీవితం తప్పలేదు. ఆయన తననెంతో అభిమానంగా 'ఉరేయ్ అబ్బాయ్!' అని పిల్చేవాడు. "ఊరేగింపులో పట్టుకున్న జెండా ఎపుడూ నేలని తాకకూడదురా అబ్బాయ్" అన్నాడాయన ఒకసారి ఏదో సందర్భంలో. ఆ మాట ఫలితంగా తర్వాత ఊరేగింపు ప్రదర్శనలో లాఠీ దెబ్బలకి క్రింద పడినా, జెండా వదలనందుకు నల్లపోలీసుల బూట్ల కింద తన చెయ్యి పిప్పి అయ్యి ఎముకలు విరిగాయేగానీ, స్పృహ తప్పే వరకూ జండా మాత్రం వదల్లేదు. ప్లీడరుగారు ఆ సంగతి తెలుసుకుని తనని చూడవచ్చి, గుండెలకి హత్తుకుని, "నిన్ను చూసి గర్విస్తున్నానురా అబ్బాయ్!" అన్నారు తడిదేరిన కళ్ళతో. ఆ చిన్న మాట తన బాధని మటుమాయం చేసి తననెంతో ఉన్నత శిఖరాలకి తీసుకుపోయింది.

ప్లీడరుగారు సాంప్రదాయవాదీ, దైవ నిష్ఠాపరుడైనప్పటికీ, ఉద్యమంలో నిండా మునిగి పూజ గదిలోకి అడుగుపెట్టడమే మానేసాడు. వందేమాతర గీతమే ఆయన మంత్రపుష్పమైంది. ఆ గీతాన్ని రుక్మిణి పాడుతూంటే ప్లీడర్‌గారితో బాటు తనూ పులకరించి పోయేవాడు. ఆ గీతం తన జీవితాంతో పెనవేసుకుపోయింది. కాబూల్ నుండి అస్సాం వరకు, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న సువిశాల సుందర సస్యశ్యామల మాతృభూమి కీర్తిని మనసారా గానం చేయడం కన్నా గొప్ప విషయం ఏముంటుందనిపించేది. "దైవభక్తి వ్యక్తికి మాత్రమే ముక్తిని ప్రసాదిస్తే - దేశభక్తి మొత్తం జాతికే బానిస బంధాల నుండి విముక్తి ప్రసాదిస్తుంది. అందుకే దైవభక్తికన్నా దేశ

భక్తే ముఖ్యంరా అబ్బాయ్!" అనే ప్లీడర్‌గారు తన గురువూ, దైవమూ అయ్యాడు. ఉద్యమానికి తన ఆస్థిని హారతి కర్పూరంలా కరిగించేయడమేకాక, తాతిచ్చిన భవంతిని కూడా అమ్మేసి కుటుంబంతో కట్టుబట్టలతో చిన్న పెంకుటింటికి అద్దెకి మారిన ప్లీడరు గారిని చూసి తనకి కన్నీరాగలేదు. అయినా తనకి ఆశ్రయమివ్వడం ఆయన మానలేదు! "తలదాచుకోడానికి ఎక్కడుంటేనేమిరా? నా తల్లి విముక్తి కోసం ఆస్థిని అమ్మానేకాని విలాసాలకోసం కాదుగా" అని తనని ఊరడించాడాయన. దిగజారిన తమ స్థితికి ఆయన భార్యగానీ, రుక్మిణికానీ పిసరంతైనా బాధపడినట్లు కన్పించలేదు. ఏమి వింత కుటుంబం అనిపించేది. పట్టు చీరలు కట్టినపుడెంత ఆనందంగా ఉన్నారో - చిరుగుల నూలు వస్త్రాలు కట్టినపుడూ అంతే ఆనందంగా ఉన్నారు. ఎదుగుతూన్న రుక్మిణి చదువు బాధ్యతలు తనకప్పగించారు. తనతో సన్నిహితంగా మసిలే ఏకైక ఆడపిల్ల రుక్మిణి ఒక్కర్తే. తనలోనూ రెక్కలు విప్పుకుంటూన్న వయసూ, మనసూ కొత్తలోకాల్ని ఆవిష్కరించడం మొదలుపెట్టాయి. రుక్మిణి పెద్ద అందగత్తేమీ కాదు. కానీ రుక్మిణిలోని అద్భుతమైన ఆకర్షణ ఆ పిల్ల నవ్వు! మనసులోని మాధుర్యాన్ని ఆవిష్కరించి గిలిగింతలు పెట్టిస్తుందా నవ్వు. కానీ గురుపుత్రిక అనే గౌరవ భావం తనని ఆ పిల్ల, ముఖంలోకి సూటిగా చూడనిచ్చేదికాదు. ఆ నవ్వుల పిల్లకి గురువై చదువు చెప్పడం తనకి కత్తిమీద సామయ్యేది. తన అవస్థని గ్రహించినట్టు రుక్మిణి మరీ మరీ నవ్వేది.

తెల్లవాడు స్వాతంత్ర్యం ఇచ్చేసి తన దీవికి మూలాముల్లే సర్దుకుపోతాట్ట అనే విషయం తనకెంతో ఆనందాన్ని, ఆశ్చర్యాన్నీ ఇచ్చింది. నమ్మలేక, నిజమేనా బాబుగారూ అని ప్లీడరుగారిని అడిగాడు. జైలు జీవితంతోనూ, దరిద్ర దేవత ఇనుప కౌగిట్లోనూ నలిగి, అకాల వృద్ధాప్యపు వాతబడ్డ ఆయన మంచంమీద దగ్గుతూ - "కేవలం మన పోరాటం వల్లే స్వాతంత్ర్యం వచ్చిందనుకోవడం నిజంకాదురా అబ్బాయ్. యుద్ధంలో చావు దెబ్బ తిని, కళ్ళు లొట్టపోయి, లేచే సత్తువ లేని తెల్లవాడు ఇంక ఈ దేశాన్ని పాలించడం తన వల్ల కాదనే సత్యాన్ని గ్రహించి వదిలిపెట్టిపోతున్నాడు. కానీ పోయే వెధవ తిన్నగా పోక నిండుకొంపని నడినెత్తికి రెండుగా చీల్చిపోతున్నాడు! వాడి కుసంస్కారం అటువంటిదిరా. కానీ ఓ విషయం గుర్తు పెట్టుకో. అధికారం రుచి మరిగిన నల్లదొరలు తెల్లదొరలను మించిన క్రూరమైన అవినీతి పాలననీ, అణచివేతనీ ప్రజల నెత్తిన రుద్దుతారు. తెల్లదొరల పాలనకి వ్యతిరేకంగా జరిపిన పోరాటం వంటిది నల్లదొరల ప్రజా వ్యతిరేక పాలనకి కూడా వ్యతిరేకంగా కొనసాగాలి. తెల్లవాడిపై ఝుళిపించిన పోరాటపు కొరడా నల్లదొరల వీపుల మీద కూడా వాతలు పెట్టగలగాలి. స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడం కన్నా దాన్ని నిలుపుకోవడం మరింత కష్టం" అని ఆయన అనడం తనని ఆశ్చర్యపరచి ఆలోచనలో పడవేసింది. దేశమంతా స్వాతంత్రం వస్తోందనే సంబరంలో కొట్టుకుపోతూంటే ఇటువంటి హెచ్చరికలు చేసే ముందుచూపు ఉన్న నాయకులెంతమంది అనిపించింది.

ప్లీడరుగారి పలుకుబడితో తనకి జిల్లాబోర్డు స్కూల్లో మాష్టరుగిరీ దొరికింది. ఆయన చలవ వల్ల జీవితంలో నిలదొక్కుకున్నాననే ఆనందాన్ని ఆ దంపతుల అనారోగ్యం కబళించేసింది. ఒక రోజు ఆయన కబురు చేస్తే వెళ్ళాడు. ఎముకల పోగులా వున్న ఆయన్ని చూడగానే నిలువునా నీరయ్యాడు. "రారా అబ్బాయ్! నీ నెత్తినో బరువు పెడదామని పిల్చాను" అన్నాడాయన లేచి కూర్చోడానికి ప్రయత్నిస్తూ. రుక్మిణి పెళ్ళి చేసే బాధ్యత తనకి అప్పగిస్తారా అనిపించింది. ఆ పిల్లకి తగ్గ వరుడ్ని చూడటం తన వల్ల అయ్యేనా అనుకుంటూ ప్రశ్నార్థకంగా చూసాడు.

"నీకభ్యంతరం లేకపోతే రుక్మిణిని నీ చేతుల్లో పెడదామనుకుంటున్నాంరా అబ్బాయ్" అన్నాడాయన సూటిగా. తను ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. కలా-నిజమా అనిపించింది. అద్భుతమైన ఆ నవ్వుల గని తన స్వంతం కాబోతూందా! వేరే గత్యంతరం లేక తనకివ్వబోతున్నారా? చూస్తూ చూస్తూ ఓ అనాధని చేసుకోడానికి రుక్మిణి ఇష్టపడుతుందా? ఆస్థిపోతేనేం ప్లీడరు గార్కి అపారమైన పలుకుబడి, పేరు ప్రతిష్టలూ పుష్కలంగా వున్నాయి. ఆయన తలచుకుంటే చక్కని వరుడే దొరకడా? అడిగారు కదా అని ఒప్పేసుకోవడం తన దురాశ కాదా?

"లోకంలో మీరు తప్ప వేరెవరూ లేని అనాధని. రుక్మిణికి తగ్గ వరుడ్ని కాదేమో" ఎలాగో నోరు పెగల్చుకుని



అన్నాడు ఎక్కడా కనిపించని రుక్మిణి కోసం కలియ చూస్తూ.

"రుక్మిణి నాయింట నా కూతుర్లాగే పెరగడం వల్ల రుక్మిణి మాకు పుట్టిన పిల్లే అనుకుంటున్నావు కదా. రుక్మిణి మా పెంపుడు బిడ్డ. పెళ్ళయిన కొద్ది కాలానికే నాకు స్వాతంత్ర్యోద్యమంలోకి దూకబుద్ధి వేసింది. పోరాడే వాడికి భార్యాబిడ్డలు మెడకి గుదిబండలవుతారు. అందుకే పిల్లలు వద్దనుకున్నాను. కానీ స్త్రీ సహజమైన మాతృత్వ వాంఛని తీర్చుకోవడానికి నా భార్య ఓ అనాధ శిశువుని తెచ్చి పెంచింది. అది మాకు పుట్టలేదని మేం ఏనాడూ అనుకోలేదు. మేం తల్లిదండ్రులం కామని రుక్మిణీ అనుకోలేదు. అనాధ పిల్లని చేసుకోడానికి నీకభ్యంతరమా?" ప్లీడరుగారు ఎదురు ప్రశ్నించాడు. "రుక్మిణి అభిప్రాయం......" అంటూ తను నీళ్ళు నమిలాడు ఆయన చెప్పింది విని ఆశ్చర్యపోతూ, ప్రక్క గదిలోంచి చిన్నగా నవ్వు వినిపించింది - తనని మైమరపించే మధురమైన నవ్వు.

"విన్నావ్‌గా నీ ప్రశ్నకి సమాధానం!" అన్నాడాయన నవ్వుతూ.

పదిమంది పెద్దల సమక్షంలో ప్లీడరు దంపతుల ఆశీర్వచనాలతో అలా రుక్మిణి తన జీవితంలో అడుగుపెట్టి తనింట దీపం వెలిగించింది.

నవ్వులగని తనింటికి వస్తూ పుట్టింటి ఆస్థిగా ఒక విలువైన వస్తువుని తెచ్చింది. ఎవరో చక్కని ఆర్టిస్టు అఖండ భారతదేశ పటంపై జెండా పట్టుకుని నిలబడ్డ భారతమాత బాక్ గ్రౌండ్‌గా వందేమాతరం గీతాన్ని ముత్యాల్లాంటి అక్షరాలతో వ్రాసి ప్లీడరుగార్కి బహూకరించిన చిత్రపటం అది. ప్లీడర్‌గారి గదిలో ఆయన కుర్చీకి వెనక గోడమీద ఉండేదది. దాన్ని మొదటి గదిలో పిల్లలకి పాఠాలు చెప్పే చోట అందరికీ కన్పించేలా గోడకి చక్కగా తగిలించాడు తనే. స్కూల్లో పిల్లలకి తను బోధించే మొదటి పాఠం వందేమాతర గీతమే, దాని అర్ధమూను. అందుకే తనని అందరూ వందేమాతరం మాష్టారు అని పిలుస్తారు ఈనాటికీ. ఉపాధ్యాయుడుగా తనేనాడూ ఎవరికీ తలవంచలేదు. తప్పుచేసిన ఎవరినీ వేలెత్తి చూపకా మానలేదు. అందుకే - అవినీతినీ, ఆశ్రిత పక్ష పాతాన్నీ అన్యాయాలనీ ప్రశ్నించినందుకే తను చాలాసార్లు అధికారులు రాజకీయ నాయకుల వేధింపులకీ, దౌర్జన్యాలకీ గురయ్యాడు. రౌడీ విద్యార్థులని ఉసిగొల్పి కొట్టించారు. పరీక్షల్లో విద్యార్థులకి కాపీలు అందచేస్తున్నాడని అక్రమ ఆరోపణలు చేసి సస్పెండ్ చేయించారు. మాట్లాడితే ట్రాన్స్‌ఫర్లు! అయినా తను లొంగలేదు, పంథా మార్చుకోలేదు. ప్లీడరుగారు హెచ్చరించిన నల్లదొరల చీకటి మనసుల హేయత్వం అనుభవంలోకి వచ్చినా మారలేదు. ఇంత కుళ్ళు వ్యవస్థతోనూ అవిశ్రాంత పోరాటం జరిపే తనకి ఓదార్పునీ, స్థయిర్యాన్నీ ఇచ్చి ప్రోత్సహించేది తన నవ్వులగని రుక్మిణే. అమృత సేవనం గాయాలని మాన్పినట్టు రుక్మిణి నవ్వు ముఖం తన శ్రమనీ ఆవేదననీ క్షణాల్లో మటుమాయం చేసేది.

కాలం చెల్లిన తల్లి పురుటికందుని వదిలి వెళ్ళిపోయినట్టు నవ్వులగని తనని వదిలి వెళ్ళిపోయాకా మొదటిసారిగా రుక్మిణి మీద కోపం వచ్చింది - తనని ఒంటరి నరకానికి వదిలి వెళ్ళిపోయినందుకు. ఆ నవ్వుని చిన్ని భారతి పుణికి పుచ్చుకున్నాకా తనకి కొంత ఊరట కలిగింది. ఆ పిల్లని పెంచడంలో, విద్యాబుద్ధులు చెప్పడంలో పడి తనకి కాలగమనమే తెలియడం లేదు. రుక్మిణి దూరమై అపుడే పధ్నాలుగేళ్ళు కరిగిపోయాయి! భారతి పదో తరగతి పరీక్షలకి ప్రిపేరవుతోంది. ఎంత చురుకు, ఎన్ని తెలివితేటలు! ఇక ఈ పిల్ల చదువు సంధ్యలు తను చూడలేదు. ఖర్చయినా మంచి ట్యూటర్‌ని చూడాలని అనుకుంటూనే వున్నాడు.

భారతి పుట్టిన రోజు తనకో పండగ. ఆ రోజు రుక్మిణి పుట్టిన రోజు తీపి గుర్తులు గుర్తొస్తాయి. తను లేచేసరికే, తెల్లారగట్లే తలంటుకుని, కొత్త చీర కట్టుకుని తన పాదాలకి నమస్కరించేది! "ఇదేమిటి? నేనేమైనా గుళ్ళో దేవుడ్నా" అనేవాడు అటువంటి సాంప్రదాయాలు నచ్చక. "అంతకన్నా ఎక్కువే" అనేది నవ్వుల చినుకుల్ని వర్షిస్తూ. తనకి ఏ బహుమతినీ కొననిచ్చేది కాదు - 'మీ కన్నా నాకు పెద్ద బహుమతి ఏముంది?' అనేది. భారతికి కూడా ఏది కొన్నా 'ఇపుడెందుకు తాతయ్యా, అనవసరపు ఖర్చు' అంటుంది - అచ్చు రుక్మిణిలాగే! రేపే భారతి పుట్టిన రోజు. మంచి బహుమతి ఒకటి అప్పు చేసైనా కొనాలి. కరువు భత్యం పెరుగుతోంది కదా - అది పెట్టి అప్పు తీర్చే

యచ్చు. వంద రూపాయలకి ఆడపిల్లకి ఏం వస్తుంది ఈ కరువు రోజుల్లో? తనకి కూతుళ్ళు లేకపోవడంతో ఆడపిల్లలకేం కావాలో, ఏమిష్టపడతారో తనకి తెలియదు. కూతురు లేదనే లోటు తీర్చుకోడానికన్నట్టు రుక్మిణినే ఓ చిన్న పిల్లని చూసినట్టుగారంగా చూసే వాడు. భార్య, తల్లి, కూతురు, ఆత్మీయురాలి పాత్రలనన్నిటినీ ఒకర్తే ఎంత సమర్థవంతంగా నిర్వహించింది రుక్మిణి!

ఈసారి భారతి ఊహించని బహుమతిని కొని ఆశ్చర్యపరచాలి. ఏదైతే బావుంటుంది? మంచి సిల్కు పరికిణీయా? ఉహూ......రుక్మిణిలాగే భారతి కూడా వేషధారణకి, ఆడంబరాలకీ ప్రాముఖ్యతనివ్వదు. బంగారపు ముక్కు పుడకైతే? అదీ లాభం లేదు. రుక్మిణీ, భారతిలాటి వాళ్ళు బంగారానికే వన్నె తెస్తారే కానీ, బంగారం ధరించి అందాన్ని తెచ్చుకోరు. వాచీ.... వాచీ అయితే...? జీవితాంతం ఉపయోగపడే బహుమతి అది. కాలానికి కళ్ళెం వేసి, టైంటేబుల్ ప్రకారం చదువుకోడానికి బావుంటుంది.... వాచీయే కొనాలి. ఎంత ఖరీదు ఉంటుందో! ఎంతున్నా తన అవసరాలు మానుకునైనా కొనాలి. తన శిష్యుడొకతనికి వాచీల షాపు ఉన్నట్లు గుర్తు. ఆ బహుమతిని భారతి కాదనలేదు. దాన్ని చూసి ఎంత సంతోషిస్తుందో. పిచ్చిపిల్ల రుక్మిణిలా అల్పసంతోషి.

ఆలోచిస్తూనే షావుకి చేరుకున్నాడు. శిష్యుడు సాదరంగా ఆహ్వానించాడు. లేడీస్ రిస్ట్ వాచీలు రకరకాలు తీసి చూపించాడు. చివరికొక వాచీ నచ్చింది - కానీ ఖరీదే ఎక్కువ. సంశయిస్తుంటే శిష్యుడే చెప్పాడు - ఒక్కసారి ఇవ్వలేకపోతే వాయిదా పద్ధతుల్లో ఇమ్మని.

అతని ఔదార్యానికి కృతజ్ఞతలు చెప్పి అందంగా పాక్ చేయించి, కిరాణా కొట్లో వెచ్చాలు తీసుకుని ఇంటిదారి పట్టాడు.

"ఇంతాలస్యం చేసావేం తాతయ్యా?" సంచీ అందుకుని మంచినీళ్ళందిస్తూ అడిగింది భారతి. "కిరాణా కొట్లో రద్దీ ఎక్కువగా ఉంది తల్లీ" అన్నాడు సత్యమూర్తి బహుమతి సంగతి ఎత్తకుండా.

"నీకు కూడా డి.ఎ. పెరుగుతుందని ఇందాకా విశ్వనాధం అంకుల్ చెబుతూంటే విన్నాను. డిఎ అంటే ఏమిటి తాతయ్యా?" తెలియని విషయాల్ని అడిగి తెలుసుకునే విద్యార్థులంటే టీచర్‌గా తనెంతో అభిమానిస్తాడు. విషయ పరిజ్ఞానానికి ప్రశ్నించడం మూలంఅని తనునమ్ముతాడు.

డి.ఎ అంటే డియర్నెస్ అలవెన్స్ తల్లీ. అంటే కరువు భత్యం. పెరుగుతూన్న ధరల సూచిక ప్రకారం కరువుని తట్టుకోడానికి ప్రతీ ఆరు నెలలకోసారి ఉద్యోగస్తులకీ, నాలా రిటైరై పెన్షన్ తీసుకుంటున్న వాళ్ళకీ ప్రభుత్వం కరువు భత్యం ప్రకటిస్తుంది. " కాళ్ళు కడుక్కుని తుడుచుకుంటూ చెప్పాడు సత్యమూర్తి.

"అంటే దేశంలో కరువుందా తాతయ్యా? ఎప్పటి నుండి ఉంది కరువు?"

"ఉందనే కదా తల్లీ, ప్రభుత్వాలు కరువు భత్యం ఇస్తున్నది. దశాబ్దాల నుండి ఇస్తూనే ఉన్నారు. ధరలు పెరుగుతూంటే కరువు భత్యం ఇవ్వక తప్పదు కదా మరి."

"ధరలు పెరగకుండా చేస్తే ఇవ్వనవసరం లేదు కదా తాతయ్యా?"

సత్యమూర్తి ప్రశ్నార్థకంగా చూసాడు మనుమరాలి వంక.

"ఏడెనిమిది వందల ఏళ్ళ క్రితం అల్లావుద్దీన్ ఖిల్జీ అనే ఢిల్లీ సుల్తాన్ తను పరిపాలించిన ఇరవై ఏళ్ళ పాటు దేశంలో ధరలు పెరగకుండా అదుపులో పెట్టాడని మా చరిత్ర పుస్తకం చెప్తోంది తాతయ్యా...."

సత్యమూర్తి మనమరాలివంక ఆశ్చర్యంగా చూశాడు. తనూ చరిత్ర చదివాడు. ఇలా ఎపుడూ ఆలోచన రాలేదే! ఎంత సునిశితమైన ఆలోచన! వర్తమానం కన్నా మధ్యయుగాల గతకాలమే మేలా? ఆధునిక శాస్త్రీయ ప్రగతిలేని మధ్య యుగపు పాలకులు చేయగలిగిన వాటిని ఇరవయ్యొకటో శతాబ్ది పాలకులు చేయలేరా? దేశంలో కరువుందని తానే చెప్పాడా....? అనాలోచితంగా! దేశంలో కరువుంటే ఇన్ని విలాస వస్తువులెలా తయారయి అమ్ముడు బోతున్నాయి? రాజ హర్మ్యాలని తలదన్నే భవంతులతో విలాసవంతమైన కాలనీలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయి? కరువెవరికి? రెక్కాడితేగానీ డొక్కాడని జనాలకేగా. వాళ్ళకి కరువు భత్యం ఎవరిస్తున్నారు? వాళ్ళు ప్రభుత్వోద్యోగులు కారుగా కరువు భత్యం పొందడానికి. కరువు భత్యం పెరిగిందని పెన్షన్‌పై బతికే సగటు మనిషిగా తాను ఆనందిస్తున్నాడేగానీ, ఏ ఆధారమూ లేక కసాయి కరువు రక్కసి కోరలకి చిక్కి శల్యమయ్యే లక్షలాది అనార్తుల గురించి ఆలోచించాడా? దేశంలో ఇన్ని హరిత విప్లవాలొచ్చి, ప్రతి సంవత్సరం ఇన్నేసి లక్షల టన్నుల పంటలు పుష్కలంగా పండాయని ప్రభుత్వమే ప్రకటిస్తున్నపుడు కరువెక్కడి నుంచి వస్తుందో సామాన్యుడికెప్పటికీ అర్థం కాదేమో. కరువు ప్రాకృతికం కానపుడు మానవ కల్పితమే అవ్వాలిగా. ఏ నైతిక విలువలకీ కట్టుబడని మనుషులు నేతలయినపుడు సామాన్యుడికి కరువు రక్కసి ప్రేయసి అవకతప్పదేమో...

"తాతయ్యా! రాధ ఇంటికి వెడుతున్నా చదువుకోడానికి." భారతి వెడుతూ చెప్పే వరకూ సత్యమూర్తి ఆలోచనల నుండి తేరుకోనే లేదు. భారతి రేపిన ఆలోచనలతో సత్యమూర్తికి ఆ రోజు నిద్రపట్టనే లేదు. కలత నిద్రలో కూడా కరువు దృశ్యాలే.... కరువుకి తాళలేక బీదా బిక్కీ ఎక్కడికో వలసపోతున్నారు. వాళ్ళతో తానూ నడుస్తున్నాడు మైళ్ళకి మైళ్ళు. మిట్ట మధ్యాహ్నం ఎండలో వేసిన పట్టె మంచం నుండి నల్లులు రాలినట్టు - ఆకలికి నడుస్తూన్న జనాలు కుప్పలు కుప్పలుగా రాలిపోతున్నారు. అయినా ఎవరూ వెనుదిరిగి చూడటం లేదు.... గుప్పెడు మెతుకులు దొరికే చోట కోసం నడక.....నడక .... రాలిపోతూన్న జనాలు - మొదళ్ళు నరికిన అరటి చెట్లు కూలుతున్నట్టు ధబ్బుమని కూలుతున్న శబ్దాలు.... అయినా జీర్ణ వస్త్రాలు, గాజు కళ్ళతో శవాల్లాంటి జనాలు కదులుతూనే ఉన్నారు.... దూరంగా ఎక్కడో వెలుగు.... స్టార్ హోటల్ పై అంతస్థు మీద ఓపెన్ ఎయిర్ థియేటర్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటూన్న క్లాస్‌వన్ సిటిజన్స్ బఫే డిన్నర్లు ముగించి పాశ్చాత్య సంగీతానికనుగుణంగా అడుగులు కదుపుతూ వికవికా నవ్వుతూన్న శబ్దాలు దగ్గరవుతున్నాయి..... తన వెనుక ధబ్‌మన్న చప్పుడు.... ఎవరు... ఎవరా రాలిపోయిన అభాగ్యజీవం? భా...... భా.....ర....తి!

'భారతి!' గావుకేకపెట్టి లేచాడు సత్యమూర్తి. భ్రమ! కల భ్రమే అయినా ఆ కలగనే కాసేపూ ఎంత యదార్థమనిపిస్తుంది! లోకంలో కరువూ, ఆకలి చావులూ కలలాటి భ్రమ అయితే ఎంత బావుండును! కానీ కల తర్వాత వాస్తవం లాంటి వాస్తవం జీవితం! కాసిని మంచినీళ్ళు తాగి పడుకున్నాడు.

మెత్తని తమలపాకుల్లాటి చేతులు తన పాదాలకి తగలడంతో ఉలిక్కిపడి లేచాడు. భారతి! చిట్టితల్లి అపుడేలేచి పుట్టిన రోజు తలంటు అంటుకుని కడిగిన ముత్యంలా తయారై తనకి నమస్కరిస్తోంది - అచ్చు రుక్మిణిలాగే! లేచి, తల్లీ! అంటూ గుండెలకి హత్తుకున్నాడు. స్నానాదికాలు ముగించి వాచీ తీసిపట్టుకుని భారతిని పిలిచాడు. ఎంత సంతోషిస్తుందో వాచి చూసి ఆ కళ్ళలో మెరుపుని తను పట్టుకుని దాచుకోవాలి పదిలంగా.

"తాతయ్యా! ప్రతీ పుట్టిన రోజునా ఏదో ఒక బహుమతి ఇస్తున్నావ్. ఈసారి నేను కోరినది ఇస్తావా?" తాతయ్య పడక కుర్చీ ప్రక్కన కూర్చుంటూ అడిగింది భారతి. సత్యమూర్తి నివ్వెరపోయాడు. బహుమతులు పుచ్చుకోడానికి ఓ పట్టాన ఒప్పుకోని భారతి స్వయంగా కోరడమా!

"అడుగు తల్లీ! నీ కోరికని కాదనగలనా? ఈ పేద తాతయ్య ఇవ్వగలిగేదైతే నాకు సంతోషం అమ్మా." భారతి వంక ఆశ్చర్యంగా చూస్తూ చెప్పాడు.

"నేనోసారి చిన్నపుడు అబద్ధమాడితే నన్ను గట్టిగా మందలించావ్ గుర్తుందా తాతయ్యా...?

"అవునేమో తల్లీ! అయితే...?"

"పిల్లలకి అబద్ధమాడకూడదని చెప్పి, పెద్ద వాళ్ళు అబద్ధమాడవచ్చా తాతయ్యా?"

"ఎవరైనా సరే అబద్ధమాడకూడదు తల్లీ..' కానీ.... నీ బహుమతికీ - నీ ప్రశ్నలకీ...?"

" సంబంధం ఉంది తాతయ్యా. ఎన్నడూ అబద్ధాలాడని గాంధీ, దాసుగార్ల శిష్యుడవని చెప్పావ్‌గదా...... నువ్వు అబద్ధమాడవచ్చా తాతయ్యా?"

"నేనా! ఏమబద్ధం ఆడాను తల్లీ?"

"దేశంలో దశాబ్దాల తరబడి కరువు ఉంది కాబట్టి కరువు భత్యం ఇస్తున్నారని చెప్పావ్ గదా తాతయ్యా. దేశంలో ఇన్నేళ్ళుగా కరువు ఉంటూండగా నువ్వు రోజూ వందేమాతరం గీతంలో నా దేశం - "సుజలాం, సుఫలాం, సస్యశ్యామలాం" అని పాడటం పెద్ద అబద్ధం కాదా తాతయ్యా? నా తాతయ్య అబద్ధాలాడటం నేను సహించలేను. ఆ అబద్ధపు పాట ఇంక పాడటం మానేయ్ తాతయ్యా. అదే నేను కోరుకునే నా పుట్టిన రోజు బహుమతి...ఏం, ఇస్తావా తాతయ్యా?"

సత్యమూర్తికి నోటమ్మట మాట రాలేదు. ఏమంటోంది భారతి? ఇన్నాళ్ళూ ఏ గీతం తన ప్రాణమైందో, స్వాతంత్రోద్యమ వీరుడుగా పోరాటానికి స్ఫూర్తినిచ్చిందో ఆ మహత్తర గీతాన్ని పాడవద్దంటోందా! ఆ పాట గొప్ప అబద్ధమా! భారతి చెప్పింది ని...జ....మా? అబద్ధమాడని, సునిశితమైన మేధస్సుగల భారతి చెప్పింది ఎలా నిజం కాకపోతుంది? ని....జ.....మే కాబోలు!

గుక్కెడు మంచినీళ్ళ కోసం కడవల్ని నెత్తికెత్తుకుని మండుటెండలో మైళ్ళదూరం నడిచే నిర్భాగ్యులైన లక్షలాది దాహార్తులున్న దేశం సుజలాం ఎలా అవుతుంది! సమస్త జీవాలకు జీవనాధారమైన పచ్చదనాన్ని శత్రువుగా భావించి ఎక్కడికక్కడే చెట్టు చేమల్ని నరికేసి దేశాన్ని మరుభూమిగా మార్చే ప్రయత్నంలో పుడమితల్లి ధరించిన ఆకుపచ్చ వలువల్ని ఊడలాగి వివస్త్రని చేసే దుశ్శాసన పాలకులన్న దేశం సస్యశ్యామలాం ఎలా అవుతుంది? కోట్లాది మంది అన్నార్తులు దరిద్ర రేఖకు దిగువున ఆకలి చావులతో ఊగిసలాడే దేశాన్ని పట్టుకుని సుఫలాం అని కీర్తించడం గొప్ప అసత్యం కాక మరేమవుతుంది?! ఆ అసత్యాన్ని రోజూ గానం చేసే తను.... తను..... సత్యమూర్తి కాదు - అసత్యమూర్తి! ఓ గొప్ప అబద్ధాన్ని నిజమనుకుని గీతా పారాయణంలా నిత్య పారాయణం చేస్తూన్న మూర్ఖుడు! ఈ పిల్ల తన మనుమరాలు భారతి కాదు! తన కళ్ళు తెరిపించడానికి - తన దుస్థితికి తానే విలపిస్తూ, తన దుస్థితిని వెటకారం చేస్తూన్న ఆ గీతాన్ని పాడవద్దని చెప్పడానికి తనింట పుట్టిన భారతమాత కాబోలు!

గుండె తడిసి బరువెక్కి జలజలరాలుతూన్న కన్నీటితో వందేమాతరం సత్యమూర్తి కళ్ళకి ఎదురుగా గోడపై ఉన్న దేశమాత పటం అలుక్కుపోయి తెగిన సాలెగూడులా కనిపిస్తోంది.